సాక్షి

వికారాబాద్

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



సాగునీటి కష్టాలు తీరేదెన్నడో?

రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. నేతలు ఇచ్చిన పాలమూరు ఎత్తిపోతల హామీలు నెరవేరడం లేదు. 10లో▸



ఏర్పాటయ్యేనా?

రేషన్ షాపుల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ కోసం ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీలు పత్తాలేవు. 10లో▸



న్యాయం చేసే వరకు పోరాటం

న్యాయమైన తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు అన్నారు. 11లో▸

ఇసుక చవక

పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక కష్టాలు తప్పాయి. సొంత గూడు నిర్మించుకునే వారికి ఇసుక భారమైన వేళ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రకటించిన కొత్త పాలసీ ఎంతో ఊరటనిస్తోంది. ఇప్పటి వరకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు పలికిన ట్రాక్టర్ ఇసుక ధర.. కలెక్టర్ నిర్ణయంతో రూ.600కు దిగొచ్చింది. దీనిద్వారా ఇటు ప్రజలకు చవకగా లభించడంతో పాటు అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.



కలెక్టర్ నిర్ణయంతో దిగొచ్చిన ధర

- క్యూబిక్ మీటర్‌కు రూ.200
- ట్రాక్టర్ ఇసుకకు రూ.600
- డీడీ చెల్లించిన వెంటనే అనుమతులు
- తహసీల్దార్లకు అందిన సర్క్యులర్లు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు

బషీరాబాద్/యాలాల: తాండూరు నియోజకవర్గంలో ఇల్లు కట్టుకునేవారికి ఉండే కష్టాల్లో మొదటిది ఇసుక లభ్యత. పక్కనే నదులు పారుతున్నా.. పెద్ద మొత్తంలో ఇసుక అందుబాటులో ఉన్నా.. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇదే అదనుగా తీసుకున్న అక్రమార్కులు ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక కొల్లగొట్టి సొమ్ము చేసుకున్నారు. దీనిద్వారా ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు వినియోగదారుల జేబులు ఖాళీ అయ్యేవి.. క్యూబిక్ మీటర్ ఇసుక ధరను రూ.200గా నిర్ధారిస్తూ కలెక్టర్ కొత్త పాలసీని ప్రకటించారు. దీన్ని తక్షణమే అమలు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఒక ట్రాక్టర్‌లో మూడు క్యూబిక్ మీటర్ల ఇసుక పడుతుంది. ఈలెక్కన ట్రాక్టర్‌కు రూ.600 చెల్లిస్తే చాలు. వాహనం కిరాయి, లేబర్ ఖర్చు మాత్రం వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో అన్నివర్గాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కేరాఫ్ యాలాల..

సహజసిద్ధంగా లభించే ఇసుకకు యాలాల మండలానికి పెట్టింది పేరు. సుమారు 15 కిలోమీటర్ల మేర పారే కాగ్నా, కాకరవేణి నదులు ఇందుకు ప్రసిద్ధి గాంచినవి. వీటిలో దొరికే ఇసుకను వాడేందుకు నిర్మాణదారులు ఎంతో ఆసక్తి చూపుతారు. దేవనూరు, నాగసముందర్, విశ్వనాథ్‌పూర్, గోవిందరావుపేట, బెన్నూరు, అగ్గనూరు, కోకట్, సంగెంకుర్దు శివార్లలో పుష్కలమైన ఇసుక మేటలున్నాయి.

నిర్లక్ష్యం చేస్తే వేటు తప్పదు..

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లకు గట్టి ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ఇకపై పత్రికల్లో 'కాగ్నా లూటీ', 'కాగ్నాలో ఇసుక దోపిడీ', 'ఇసుక అక్రమ రవాణా' వంటి కథనాలు వస్తే.. సదరు మండల తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ సమయంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలను ఉటంకిస్తూ హెచ్చరికలు జారీ చేయడం విశేషం. గతంలో బషీరాబాద్ మండలంలోని కాగ్నానది నుంచి కన్నడిగులు చేస్తున్న ఇసుక దోపిడీపై 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ఇసుక రీచ్‌లు లేని దగ్గర స్థానికంగా లభించే చిన్న చిన్న వాగుల నుంచి కూడా ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో కాగ్నా నది పరివాహక మండలాల్లో కాకుండా ఇతర మండలాల్లో జరిగే పనులకు రీచ్‌ల నుంచి ఇసుక అనుమతులు ఇస్తే ధరాభారంతో మళ్లీ సమస్యలు వస్తాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని చిన్న వాగుల నుంచి కూడా ఇసుక తీసుకెళ్లేలా అనుమతులు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. ఇసుక కావాల్సిన వారు బ్యాంకులో డీడీ కట్టి తహసీల్దార్‌కు ఇచ్చిన వెంటనే ఆర్డర్ కాపీ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా అక్రమ రవాణాకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు.

రీచ్‌లు గుర్తించాం



తాండూరు రూరల్: తాండూరు పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు శుభవార్త. కలెక్టర్ ఆదేశం మేరకు ట్రాక్టర్ ఇసుక ధరను రూ.600గా నిర్ణయించాం. ఒక్కొక్కరికి నాలుగు ట్రాక్టర్ల వరకు ఇస్తాం. పాత తాండూరు, వీర్‌శెట్టిపల్లి, ఖాంజాపూర్‌లో ఇప్పటికే రీచ్‌లు గుర్తించాం. ఇసుక అవసరమైన వినియోగదారులు దళారులను నమ్మి మోసపోవద్దు.

– చిన్నప్పలనాయుడు, తహసీల్దార్, తాండూరు

డీడీ చెల్లిస్తే చాలు



ప్రభుత్వ, ప్రైవేటు పనులకు అవసరమైన ఇసుక కోసం డీడీలు చెల్లిస్తే చాలు. లభ్యత ఉన్న అన్ని ప్రాంతాల నుంచి అనుమతి ఇచ్చేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సహజ సంపద పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. ఇకనుంచి అనుమతి లేని వాహనాలను మరో మాట లేకుండా సీజ్ చేస్తాం. సంబంధిత వ్యక్తులపై కేసులు చేస్తాం.

– గోవిందమ్మ, తహసీల్దార్, యాలాల

పది నిమిషాల్లో పర్మిషన్



కలెక్టర్ ఆదేశాల మేరకు పది నిమిషాల్లో ఇసుక పర్మిషన్ ఇస్తాం. అవసరమైన వారు కలెక్టర్ పేరున బ్యాంకులో కట్టిన డీడీని తెచ్చిస్తే ట్రాక్టర్ నంబర్‌తో ఆర్డర్ కాపీ అందజేస్తాం. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణా చేసుకోవచ్చు. సెలవు రోజుల్లో అనుమతి లేదు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తాం.

– వెంకటస్వామి, తహీసల్దార్ బషీరాబాద్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి చిత్రంలో ఎస్పీ కోటిరెడ్డి

సమ సమాజాన్ని నిర్మిద్దాం

- వివక్షను రూపుమాపుదాం
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- ఎస్పీ, నిఘా విభాగాలతో సమీక్ష
- సంఘ విద్రోహ శక్తులపై నిఘా పెట్టాలని ఆదేశం

వికారాబాద్ అర్బన్: సమసమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. అత్యాచారాల నివారణ చట్టం, పౌర హక్కుల పరిరక్షణ చట్టం అమలు తీరుపై ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సౌకర్యాలు అందరికీ అందుబాటులో ఉండాలని, ఎలాంటి వివక్షకు తావులేకుండా చూడాలని సూచించారు. కొంతమంది ప్రజల్లో విభేదాలు, తారతమ్యాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటారని, ఇలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆలయ ప్రవేశాల్లో వివక్షకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో నెలకొనే చిన్నచిన్న సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఇతరులను ఇబ్బంది పెట్టాలని చూసే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఎస్పీ కార్యాలయం నుంచి నివేదికలు వచ్చిన రెండు రోజుల్లో ఆమోదించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ప్రతీ 30న పౌరహక్కుల దినోత్సవం

ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. పల్లెల్లో ఎలాంటి పని చేసినా ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. పౌర హక్కుల సమావేశం నిర్వహించే రోజు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేస్తే అభివృద్ధితో పాటు అన్నిరంగాల్లోనూ అద్భుతమైన ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు.

తప్పు చేస్తే వదిలేది లేదు

ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో తప్పు చేసిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. వివిధ శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు సత్యవతి, యాదయ్య, రాములు, రమేశ్‌బాబు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ పాల్గొన్నారు.

స్వచ్ఛ జీపీలను ఎంపిక చేయండి

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ అవార్డులకు గ్రామాలను ఎంపిక చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్డీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచాయతీల్లో వ్యక్తిగత మరుదొడ్లు, ఇంకుడు గుంతలు, మురుగు కాల్వలు, పారిశుద్ధ పనులు చేపట్టి.. మెరుగ్గా ఉన్న జీపీలను అవార్డులకు ఎంపిక చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అవార్డుల కోసం ఒక్కో మండలం నుంచి ఐదు గ్రామాలను సెలెక్ట్ చేసి పంపించాలని తెలిపారు. ఇందులో 15 ఉత్తమ పంచాయతీలను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని స్పష్టంచేశారు. ఎంపిక విషయంలో నిబంధనలు పాటించాలని సూచించారు.

న్యూస్‌రీల్

'డబుల్' వడబోత



దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు రూరల్: తాండూరు మండలం ఖాంజాపూర్ గేటు వద్ద.. పట్టణ ప్రజల కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది వడబోస్తున్నారు. 588 ఇళ్లకు గాను 9,436 మంది అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు సుమారు 40శాతం దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 6 వేల అప్లికేషన్లను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ఆధార్ వివరాలను లింక్ చేసి.. సొంత ఇల్లు, కారు, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారిని ఇందులో నుంచి మినహాయించనున్నారు. అర్హులైన వారి వివరాలతో షార్ట్ లిస్ట్ రూపొందించి ఆయా వార్డుల్లో ప్రదర్శిస్తారు. అనంతరం ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, అసలైన అర్హులను ప్రకటిస్తామని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ దళారులను నమ్మవద్దని సూచించారు.

పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంచంద్రయ్య



నూతన అధ్యక్ష, కార్యదర్శులతో బార్ సభ్యులు

పరిగి: పరిగి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా రాంచంద్రయ్య ఎన్నికయ్యారు. తెలంగాణ బార్ కౌన్సిల్ అడ్‌హక్ కమిటీ మెంబర్లు దయాకర్‌రెడ్డి, గౌస్‌పాషా ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. 43 మంది సభ్యులకు గాను అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో రాంచంద్రయ్యకు 28 ఓట్లు, కృష్ణారెడ్డికి 15 ఓట్లు వచ్చాయి. దీంతో బార్ అధ్యక్షుడిగా రాంచంద్రయ్య విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా నర్సింహరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రతినిధులను బార్ సభ్యులందరూ కలిసి సన్మానించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గురునాథ్‌రెడ్డి



గురునాథ్‌రెడ్డి



ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్: కొడంగల్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శిగా దాసప్పయాదవ్, కోశాధికారిగా ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌ను ఎన్నుకున్నారు. 2023– 24 సంవత్సరానికి వీరి సేవలు అందుబాటులో ఉంటాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మురహరి వశిష్ఠ, జయతీర్థాచారి, శివరాజ్ పాటిల్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి కొత్త సామగ్రి



స్టడీ చైర్స్, వైఫై



వికారాబాద్ అర్బన్: కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లా గ్రంథాలయానికి కొత్త సామగ్రి సమకూరింది. ఈ నెల 21న లైబ్రరీని సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి నిరుద్యోగులు, విద్యార్థులతో ముచ్చటించారు. వసతులు, అవసరాలపై ఆరా తీశారు. రీడింగ్ కుర్చీలు, ప్యాడ్లు, 6 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు, ఇంటర్‌నెట్ సౌకర్యంతో పాటు వైఫై సదుపాయాలు కావాలని యువత వివరించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటున్న లైబ్రరీ సమయాన్ని రాత్రి 10గంటల వరకు పెంచాలని కోరారు. వీరి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ గ్రంథాలయ వేళలను తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం స్టడీ చైర్స్, పాఠ్యపుస్తకాలు, ఇంటర్‌నెట్, వైఫై సదుపాయాలు సమకూర్చారు.

నేను పక్కా లోకల్..



తాండూరు పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- వలస నేతల మాటలు నమ్మొద్దు
- హామీలన్నీ నెరవేరుస్తా
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఆశీర్వదించండి
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: 'నేను పక్కా లోకల్.. తాండూరు ప్రాంత అభివృద్ధే నాధ్యేయం.. వలస నేతల మాయ మాటలు నమ్మొద్దు' అని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన 'గల్లీగల్లీకి పైలెట్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో 1నుంచి 4వార్డులతో పాటు 24, 25 వార్డుల్లో పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రతీ వార్డుకు రూ.కోటి నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నానని తెలిపారు. గతంలో 40 ఏళ్ల పాటు తాండూరును పాలించిన నేతలు అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. తాను గెలిచిన నాలుగేళ్లలో రూ.వందల కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నానని స్పష్టంచేశారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన వలస పాలకులు తమ అభివృద్ధి తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. తాను తాండూరు బిడ్డనని.. ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగానని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తాండూరుకు రూ.134 కోట్ల నిధులు తీసుకువచ్చానని వివరించారు. మున్సిపాలిటీలోని ఒక్కో వార్డుకు ఒకే విడతలో రూ.కోటి చొప్పున అందించానన్నారు. వార్డుల్లోని సమస్యలను పరిష్కరించిన తర్వాతే ఓటు అడుగుతానని, అభివృద్ధిని చూసే ఆశీర్వదించాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

దేశం, రాష్ట్రం, తాండూరులో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కాలం చెల్లిందని రోహిత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తాండూరులో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఎంతో మంది తమకు మద్దతుగా పార్టీలో చేరుతున్నారని స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. దళితబంధు పథకంలో దళిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నయిం, మున్సిపల్ కౌన్సిలర్లు విజయాదేవి, అస్లాం, సంగీతాఠాకూర్, భీంసింగ్‌రాథోడ్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు'ను పూర్తి చేయిస్తాం

- అవసరమైతే ప్రభుత్వం మెడలు వంచుతాం
- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కొందుర్గు: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక ఆ ఊసే ఎత్తడం లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి విమర్శించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు గుర్తించిన స్థలాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం మెడలు వంచి పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయిస్తామని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, పార్టీ మండలాధ్యక్షులు రాజు, కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరేందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, వీరేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, దీక్షిత్, దర్శన్, పెంటయ్య, రవి, భాస్కర్ పాల్గొన్నారు.



ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

ఇల్లే కదా.. పైకెత్తుదాం!

- హైడ్రాలిక్ జాకీల సాయంతో పైకి లేస్తున్న గృహం
- తాండూరులో కొనసాగుతున్న లిఫ్టింగ్ పనులు
- ఫీట్ మేర లేచిన ఇల్లు
- జిల్లాలోనే తొలి ప్రయోగం

తాండూరు: జాకీల సాయంతో ఇళ్లను పైకి లేపవచ్చని.. చక్రాలు ఏర్పాటు చేసి మరో చోటకు తరలించవచ్చని వినడం, టీవీలు, పేపర్లలో చూడటం తప్ప.. తాండూరు ప్రజలెవరూ ప్రత్యక్షంగా చూడలేదు. అయితే మండల పరిధిలో ఓ ఇంటిని జాకీలు పెట్టి పైకి ఎత్తుతున్న సంఘటనను నేరుగా వీక్షించి ఆశ్చర్యపోతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఐదేళ్ల క్రితం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు గ్రీన్ సిటీలో ఇల్లు నిర్మించుకున్నాడు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నూతన గృహంలోకి అడుగుపెట్టిన ఆయన కొన్నాళ్ల పాటు సంతోషంగా ఉన్నాడు. గత మూడు సీజన్లలో కురిసిన భారీ వర్షాలతో అసలు విషయం తేటతెల్లమైంది. మొదట్లో బాగానే అనిపించిన ఇల్లు.. ఆ తర్వాత లోతులో పడినట్లు కనిపించింది. వర్షం పడితే చాలు వరద నీరంతా మోకాళ్లలోతు మేర ఇంట్లోకి వచ్చి చేరుతోంది. ఎంతో కష్టపడి నిర్మించుకున్న కలల సౌధం ఇలా అయ్యిందే.. అని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేస్తుండేవాడు. ఇంటిని కూల్చేద్దామంటే.. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి కట్టలేని పరిస్థితి. ఇలాగే వదిలేద్దామంటే ఇంట్లో ఉండలేని దుస్థితి. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న రవీందర్‌రెడ్డి తన సమస్యను స్నేహితుడైన మహిపాల్‌రెడ్డికి చెప్పుకొన్నాడు. ఇంటికి ఎలాంటి సమస్య ఎదురవకుండా..పైకి లేపే విధానం అందుబాటులోకి వచ్చిందని చెప్పడంతో..వివరాలు తెలుసుకునే పనిలో పడ్డాడు. పట్టణానికి చెందిన సివిల్ ఇంజినీర్ సోహెబ్ హైదరాబాద్‌లోని జూబ్లీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పని చేస్తూ.. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లను జాకీల సాయంతో పైకి లేపుతున్నట్లు తెలుసుకున్నాడు. వెంటనే సోహెబ్‌ను కలిసి, తన సమస్యను వివరించాడు. ఇంటిని పైకి ఎత్తేందుకు రూ.4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో తన బృందంతో రంగంలోకి దిగిన సోహెబ్ ఇల్లు లిఫ్టింగ్ పనులను ప్రారంభించాడు. మన జిల్లాలో జాకీల ద్వారా పైకి లేపుతున్న తొలి ఇల్లు ఇదే కావడం గమనార్హం. 260 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటిని ఎత్తేందుకు మొత్తం 130 హైడ్రాలిక్ జాకీలు వినియోగించనున్నట్లు సోహెబ్ తెలిపారు. 18 మంది కార్మికులతో రెండు రోజులుగా పనులు కొనసాగుతున్నాయి. భవనానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా మెట్లతో పాటు ఇల్లు మొత్తాన్ని పైకి లేపడం ప్రారంభించారు. రెండు రోజుల్లో ఇల్లు ఫీట్ ఎత్తు లేచింది. భవనానికి ఎక్కడా చిన్నపాటి సమస్య కూడా ఎదురు కాలేదు. ఇరవై రోజుల్లో సుమారు మూడు ఫీట్లకు పైగా లేపి.. వందశాతం సురక్షితంగా యజమానికి ఇంటిని అప్పగిస్తామని ఇంజనీర్ తెలిపారు.



గ్రీన్ సిటీ కాలనీలోని రవీందర్‌రెడ్డి ఇల్లు



భవనం అడుగు భాగాన అమర్చిన జాకీలు



ఇంట్లో కొనసాగుతున్న పనులు

క్లుప్తంగా

నేడు 'డయల్‌ యువర్‌ డీఎం'

తాండూరు: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో నెలకొన్న సమస్యలపై శనివారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు డీఎం సమత ప్రయాణికుల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. ప్రయాణికులు 99592 26251 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీఎంశ్రీ పథకానికి మోడల్‌ స్కూల్‌ ఎంపిక

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని ఐనెల్లి శివారులో ఉన్న మోడల్‌ స్కూల్‌ పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో మోడల్‌ స్కూల్‌ ఎంపికైనట్లు ప్రిన్సిపల్‌ ప్రకాశ్‌గౌడ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక కావడంతో పాఠశాల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ఈ నిధులతో సాంకేతిక సాధనాలను సమకూర్చుకోవచ్చని తెలిపారు. సోలార్‌ ప్యానెళ్లు, ఎల్‌ఈడీ లైట్లు, ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

పరిగి: రేషన్‌ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానిక పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. రాఘవపూర్‌ గేట్‌ దగ్గర ఆటోలో 20 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

కేసు నమోదు

కొడంగల్‌ రూరల్‌: మండల పరిధిలోని ప్యాలమద్ది గేటు సమీపంలో ఇండికేటర్‌ వేయకుండా ఆగి ఉన్న లారీని బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. పెద్దేముల్‌ మండలానికి చెందిన మృతుడి తండ్రి పి.మోహన్‌రెడ్డి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్‌ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

కుల్కచర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధిలోని బొంరెడ్డిపల్లికి చెందిన దండు వెంకటేశ్‌ అనుమతులు లేకుండా తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో ఘనాపూర్‌ శివారులో శుక్రవారం పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గిరి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


నవీన్‌ (ఫైల్‌)

బొంరాస్‌పేట: మండల పరిధిలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. లింగన్‌పల్లికి చెందిన కనిగెరి నవీన్‌(23) బొంరాస్‌పేట నుంచి గురువారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగివెళ్తున్నాడు. నాగిరెడ్డిపల్లి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం పరిగి ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నారు.

క్రీడల్లో ఉచిత శిక్షణ

పరిగి: క్రీడల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్‌ 1వ తేదీ నుంచి పట్టణ కేంద్రంలోని న్యూ బ్రిలియండ్‌ హై స్కూల్‌లో విద్యార్థులకు వాలీబాల్‌, కబడ్డీ, తదితర క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తీసుకునే విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. పలువురు దాతల సహాయంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 62818 85229, 90001 97921 నంబర్లను సంప్రదించాలన్నారు.

సాగునీటి కష్టాలు తీరేదెన్నడో?

- అటకెక్కిన కాగ్నా ఎత్తిపోతలు
- ముందుకు కదలని పాలమూరు పథకం
- అమలు కాని మంత్రుల హామీలు


హస్నాబాద్‌ చెరువును పరిశీలిస్తున్న నిరంజన్‌రెడ్డి (ఫైల్‌)

కొడంగల్‌: రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్‌ కాకతీయ వల్ల చెరువులకు మేలు చేస్తామని గొప్పలు చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలుగా మారాయి. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే పాలమూరు ఎత్తిపోతల పథకానికి కేంద్ర జల సంఘం అనుమతి నిరాకరించింది. దీంతో ఈ ప్రాంత రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చెరువులు కుంటల్లో కంప చెట్లు మొలిచాయి. పూడిక తీత లేక చెరువుల్లో సాగునీటి సామర్థ్యం తగ్గింది. కొడంగల్‌ నియోజకవర్గంతో పాటు తాండూరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల రైతులకు మేలు కలిగే విధంగా గతంలో కాగ్నా ఎత్తిపోతలకు రూపకల్పన చేశారు. అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రస్తుత మంత్రి నిరంజన్‌రెడ్డి కొడంగల్‌ నియోజకవర్గంలోని చెరువులను పరిశీలించారు. కాగ్నా ఎత్తిపోతలకు సంబంధించిన సాధ్య అసాధ్యాల గురించి అప్పటి నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నివేదికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కాగ్నా ఎత్తిపోతలకు రూపకల్పన చేస్తామని నిరంజన్‌రెడ్డి కొడంగల్‌ రైతులకు మాట ఇచ్చారు.

నాటి హామీలు ఏమాయె

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో అప్పటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి ప్రత్యేకంగా కొడంగల్‌కు వచ్చారు. తాండూరు సమీపంలోని కాగ్నా వాగు నుంచి సాగునీరు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. అప్పటి సాగునీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. కాగ్నా వాగునుంచి ఎత్తిపోతల ద్వారా కొడంగల్‌ చెరువు కింద ఉన్న 550 ఎకరాల ఆయకట్టు, హస్నాబాద్‌ చెరువు కింద ఉన్న 950 ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. వర్షాకాలంలో వరద నీటిని మళ్లించి చెరువులను నింపాలన్నది ప్రణాళిక. కాగ్నా వాగులో చెక్‌డ్యాం నిర్మించి అక్కడి రైతులు నీటిని వినియోగించుకుంటున్నారు. వర్షాలు కురిస్తే కాగ్నా వాగు పొంగి ప్రవహిస్తుంది. త్వరలో వానాకాలం సీజన్‌ ప్రారంభం అవుతుంది. జూన్‌ నుంచి వర్షాకాలం ప్రారంభం అవుతుంది. చినుకులు పడితేనే విత్తనాలు వేయడానికి పొలం అనుకూలంగా ఉంటుంది. నియోజకవర్గంలో ఎలాంటి సాగునీటి వనరులు లేకపోవడం వల్ల వర్షాధార పంటలపై రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయండి

ఫారెస్ట్‌ రాష్ట్ర చీఫ్‌ కన్జర్వేటర్‌ సైదులు


ధారూరులోని సెంట్రల్‌ నర్సరీని సందర్శించిన సైదులు తదితరులు

ధారూరు: వానాకాంలో వచ్చే హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలని ఫారెస్ట్‌ రాష్ట్ర చీఫ్‌ కన్జర్వేటర్‌ (చార్మినార్‌ జోన్‌) ఆఫీసర్‌ సైదులు జిల్లా ఫారెస్టు అధికారికి సూచించారు. సైదులు శుక్రవారం మండల కేంద్రంలోని సెంట్రల్‌ నర్సరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధారూరు ఫారెస్టు రేంజ్‌ పరిధిలో ఎక్కువ అడవి విస్తరించి ఉందని, వచ్చే హరితహారంలో అన్ని చోట్లా మొక్కలు నాటడానికి సిద్ధం చేయాలన్నారు. అడవుల్లో చెట్లు నరికివేతకు గురికాకుండా చూడాలన్నారు. ధారూరు రేంజ్‌ పరిధిలో ఎన్ని మొక్కలను సిద్ధం చేస్తున్నారని ఆయన డీఎఫ్‌ఓను ప్రశ్నించారు. రేంజ్‌ పరిధిలో 2 లక్షల మొక్కలను సిద్ధం చేస్తున్నట్లు డీఎఫ్‌ఓ వివరించారు. సీసీఎఫ్‌ వెంట ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ కృష్ణ, ఫారెస్టు సెక్షన్‌ ఆఫీసర్‌ రాజేందర్‌రెడ్డి, బీట్‌ ఆఫీసర్లు పాల్గొన్నారు.

శభాష్‌ పోలీస్‌

రహదారిపై గుంతలను పూడ్చిన పోలీసులు


రహదారిపై మొరం పోయిస్తున్న పోలీసులు

యాలాల: పోలీసులే స్వయంగా రహదారి మరమ్మతులు చేపట్టారు. తాండూరు-కొడంగల్‌ ప్రధాన రహదారి అధ్వానంగా మారి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌, సిబ్బంది శుక్రవారం రోడ్లపై పడిన గుంతలను పూడ్చారు. శుక్రవారం ఆరు ట్రాక్టర్ల మొరం తెప్పించి గుంతలు ఉన్న పోసి చదును చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తాత్కలిక మరమ్మతులను చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోలీసులు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ దస్తప్ప, నరేష్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ అగ్గనూరు శ్రీశైలం తదితరులు ఉన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం


ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: ప్రతి పౌరుడు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఆయా పీఎస్‌ల పరిధిలోని రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ పౌర హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు. అందరికీ ఒకే రకమైన హక్కులు రాజ్యాంగం కల్పిస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని యువతకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలన్నారు.

డ్రమ్ములు, ట్రేలు పంపిణీ

షాబాద్‌: షెడ్యూల్డ్‌ కులాల ఉప ప్రణాళిక ద్వారా రైతులకు డ్రమ్ములు, కూరగాయల ట్రేలు పంపిణీ చేసినట్లు భారతీయ నూనె గింజల పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్‌ సతీష్‌కుమార్‌, డాక్టర్‌ ప్రసాద్‌ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్దెంగూడ, తిర్మలాపూర్‌, బొబ్బిలిగామ, వికారాబాద్‌ జిల్లా పూడూరు మండలం మిట్ట కంకల్‌ గ్రామ రైతులకు డ్రమ్ములు, ట్రేలు అందజేశారు.

పార్కు స్థలాల్లో పాగా

పాత వెంచర్లలో దర్జాగా కబ్జా
- రియల్‌ వ్యాపారుల ఇష్టారాజ్యం
- ప్లాట్లుగా చేసి యథేచ్ఛగా విక్రయం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


పెద్దమంగళారంలో ఓ వెంచర్‌లో పార్కు స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న ప్రహరీ

మొయినాబాద్‌: ఇరవై ఏళ్ల క్రితం వెంచర్లు వేసి వాటిలో వదిలిన పార్కు స్థలాలు ఇప్పుడు మాయమవుతున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో పార్కు స్థలాలను సైతం అమ్మేస్తున్నారు. అప్పట్లో వెంచర్లు చేసిన రియల్‌ వ్యాపారులే కబ్జా చేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కాపాడాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.కోట్ల విలువ చేసే పార్కు స్థలాలు ప్లాట్లుగా మారిపోతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు సైతం కబ్జాదారులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

హైదరాబాద్‌ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్‌ మండలంలో రోజురోజుకూ భూముల ధరలు పెరుగుతుండడంతో రియల్‌ వ్యాపారులు పార్కు స్థలాలపై కన్నేశారు. పాత వెంచర్లలో ఉన్న పార్కు స్థలాలను కబ్జా చేసి విక్రయిస్తూ కోట్లు గడిస్తున్నారు.

మండలంలో 1990 నుంచి 2005 వరకు పెద్దపెద్ద వెంచర్లు చేశారు. హిమాయత్‌నగర్‌, చిలుకూరు, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, పెద్దమంగళారం, సురంగల్‌, శ్రీరాంనగర్‌, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, ఎనికేపల్లి, అజీజ్‌నగర్‌ తదితర గ్రామాల్లో అప్పట్లో రియల్‌ వ్యాపారులు వందల ఎకరాల్లో వెంచర్లు చేశారు. రోడ్లు, పార్కు స్థలాలు, క్లబ్‌ హౌస్‌ల కోసం వెంచర్లలో స్థలాలను కేటాయించారు.ఆ స్థలాలను వదిలేసి చేసిన ప్లాట్లను విక్రయించారు. ఇతరులకు విక్రయించిన ప్లాట్లు తప్ప రోడ్లు, పార్కు స్థలాలు, క్లబ్‌ హౌస్‌,ఆట స్థలాలకోసం వదిలేసిన భూమి మొత్తం రియల్‌ వ్యాపారుల పేరుతోనే రిజిస్ట్రేషన్‌ అయి ఉంది. ధరణి పోర్టల్‌ వచ్చిన తరువాత వెంచర్‌ చేసిన వారికే కొత్త పట్టాదారు పాసుపుస్త కాలు వచ్చాయి.దీంతో పార్కు స్థలాలు, క్లబ్‌హౌస్‌లు, ఆట స్థలాలకు కేటాయించిన స్థలాలను తమ ఆధీనంలోకి తీసుకుని ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు.

- ఆరు నెలల క్రితం చిలుకూరు రెవెన్యూలోని పాత వెంచర్‌లో క్లబ్‌ హౌస్‌ను కూల్చేసి స్థలాన్ని అమ్మడానికి వెంచర్‌ యజమాని యత్నించగా వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినవారు అడ్డుకున్నారు.
- తాజాగా పెద్దమంగళారం రెవెన్యూలోని ఓ పాత వెంచర్‌లో వెంచర్‌ చేసిన రియల్‌ వ్యాపారి పార్కు స్థలాన్ని కబ్జా చేస్తుండగా వెంచర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- 25 ఏళ్ల క్రితం కనకమామిడి రెవెన్యూలో సుమారు వంద ఎకరాల్లో వెంచర్‌ చేసిన రియల్‌ వ్యాపారి కొంత కాలానికి మరణించాడు. ధరణి వచ్చాక అతని భార్య పేరుతో పట్టాదారు పాసుపుస్తకం రావడంతో వెంచర్‌లోని రెండు ఎకరాల పార్కు స్థలం, క్లబ్‌ హౌస్‌ను అతని కొడుకు ప్లాట్లుగా మార్చి విక్రయించాడు.
- కేతిరెడ్డిపల్లి రెవెన్యూలోని ఓ పాత వెంచర్‌లో ఏర్పాటు చేసిన క్లబ్‌ హౌస్‌, రెస్టారెంట్‌ స్థలాన్ని ఇటీవల వెంచర్‌ యజమాని ఇతరులకు విక్రయించాడు.
- చిలుకూరు రెవెన్యూలో 20 ఏళ్ల క్రితం చేసిన వెంచర్‌లో వదిలేసిన పార్కు స్థలాన్ని వెంచర్‌ యజమానే ప్లాట్లుగా మార్చి విక్రయించాడు. వెంచర్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని సైతం కబ్జాచేసి ప్లాట్లుగా మార్చారు.
- సురంగల్‌, శ్రీరాంనగర్‌ రెవెన్యూల్లో ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లో రెండెకరాల పార్కు స్థలాన్ని ఇటీవల వెంచర్‌ యజమాని తన పేరుతో కొత్త పాసుపుస్తకాలు వచ్చాయని ఇతరులకు విక్రయించాడు.
- మొయినాబాద్‌లోని ఓ పాత వెంచర్‌లో వదిలిన 30 గుంటల పార్కు స్థలంలో కొంత కాలం క్రితం పంచాయతీ చదును చేసి మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వారు. పార్కు చుట్టుపక్కల ఉన్న ప్లాట్లను ఓ నాయకుడు కొనుగోలు చేసి పార్కును సైతం కబ్జా చేశాడు.
- హిమాయత్‌నగర్‌ రెవెన్యూలోని పాత వెంచర్‌లో గతంలో గార్డెన్‌గా చూపిన స్థలాన్ని ఓ అధికార పార్టీ నాయకుడు తక్కువ ధరకు కొనుగోలు చేశాడు.

చర్యలు తీసుకుంటాం

మొయినాబాద్‌ మండలం 111 జీవో పరిధిలో ఉండటంతో ఇక్కడ వెంచర్లు చేయడానికి అనుమతి లేదు. గతంలో చేసిన వెంచర్లలో కొన్ని పార్కు స్థలాలు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. ఎవరైనా వాటిని విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఓ, మొయినాబాద్‌

క్రికెట్‌ బెట్టింగ్‌ ముఠాపై దాడి

మొయినాబాద్‌: బుకీల ద్వారా ఆన్‌లైన్‌లో క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడి చేసి ఒకరిని పట్టుకున్నారు. మరో నలుగురు పరారయ్యారు. ఈ సంఘటన మొయినాబాద్‌ మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి హిమాయత్‌నగర్‌ గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన పెండ్యాల సాయికుమార్‌రెడ్డి, నందకిషోర్‌ పంకజ్‌ బుకీల ద్వారా ఆన్‌లైన్‌లో ఐపీఎల్‌ క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్నారు. వీరితోపాటు హిమాయత్‌నగర్‌కు చెందిన తూర్పు వెంకట్‌రెడ్డి, పల్లపు రమేశ్‌, కాశింబౌలికి చెందిన యాలాల శరత్‌రెడ్డి క్రికెట్‌ బెట్టింగ్‌ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బెట్టింగ్‌ స్థావరంపై దాడి చేశారు. దాడిలో నందకిషోర్‌ పంకజ్‌ పరార్‌ కాగా సాయికుమార్‌రెడ్డి పోలీసులకు చిక్కాడు. అతని వద్ద రూ.27,100 నగదుతోపాటు ఐసీఐసీఐ బ్యాంక్‌ ఖాతాలో ఉన్న రూ.1,71,611, కెనరా బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1,08,129 సీజ్‌ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఓటరు జాబితాలో కొత్తవారిని చేర్పించండి


మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌కుమార్‌

తాండూరు రూరల్‌: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకొనేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ అశోక్‌కుమార్‌ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తహసీల్దార్‌ కార్యాలయంలో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటరు జాబితాలో తప్పు, ఒప్పులను సరి చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగించాలని చెప్పారు. అదేవిధంగా పెళ్లయి వెళ్లిన అమ్మాయిలను కూడా జాబితా నుంచి తొలగించాలన్నారు.18 ఏళ్లు నిండిన యువతి, యువకుల నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరించాలని చెప్పారు. నియోజకవర్గంలో 266 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ చిన్నప్పల నాయుడు, సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్‌ కార్యకర్తలను ఆదుకుంటాం'


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు

కొడంగల్‌: కాంగ్రెస్‌ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో పార్టీ కార్యకర్త కావలి గోవర్ధన్‌ సోదరుడు కావలి ఆనంద్‌ గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబాన్ని తిరుపతిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ అభినందనీయం


విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు పంపిణీ చేస్తున్న శుభప్రద్‌పటేల్‌

తాండూరు: పేద విద్యార్థులకు ఉచిత ఎంసెట్‌ కోచింగ్‌ అందించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ కమిషన్‌ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమద్‌ ఫంక్షన్‌ హాలులో ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఎంసెట్‌ పరీక్షలకు ఉచిత కోచింగ్‌ అందిస్తున్నారు. ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్‌ కోచింగ్‌ సెంటర్‌ను సందర్శించారు. విద్యార్థులకు నోట్‌ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పోటీ పరీక్షలకు శిక్షణ ఎంతో దోహద పడుతుందన్నారు. పట్టుదలతో శ్రమించి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఖాలీద్‌షఫీ ఉల్లా, మున్సిపల్‌ కో ఆప్షన్‌ సభ్యులు అబ్దుల్‌ ఖవి, నాయకులు తదతరులున్నారు.

కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న కేంద్రం


మే డే వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తోందని, కార్మికుల శ్రమకు తగ్గ జీతాలు ఇవ్వడం లేదని ఫెడరేషన్‌ ఆఫ్‌ ట్రేడ్‌ యూనియన్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్‌ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో మే డే వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ. 27వేలుగా నిర్ణయించాలన్నారు. హమాలీ, కార్మికుల బోర్డులను ఏర్పాటు చేసి అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపాలన్నారు. మేడే సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బసిరెడ్డి, శ్రీశైలం, మహేందర్‌, రాములు, మాణిక్యం పాల్గొన్నారు.

పాలీహౌస్‌ రైతులను ఆదుకోండి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


చనువెళ్లిలో దెబ్బతిన్న పాలీహౌస్‌ను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: గాలివాన బీభత్సానికి నష్టపోయిన పాలీహౌస్‌ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. మండలంలోని చనువెళ్లి, అల్లవాడ, పామెన గ్రామాల్లో భారీ వడగళ్ల వాన, ఈదరగాలులకు పాలీహౌస్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం నాయకులు కంజర్ల ప్రకాశ్‌తో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. కలెక్టర్‌తో మాట్లాడి తగిన న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ఆదుకుంటామని గొప్పలు చెప్పడమే కాని క్షేత్రస్థాయిలో అందిన పరిహారం ఏమీ లేదన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులను ఆపదలో ఆదుకోవాల్సింది పోయి సర్కార్‌ పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా కార్యదర్శి జి. వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్‌ కమిటీలు ఏర్పాటయ్యేనా?

రేషన్‌ నరుకులపై కొరవడిన పర్యవేక్షణ


దౌల్తాబాద్‌ తహసీల్దారు కార్యాలయం

దౌల్తాబాద్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీ (విజిలెన్స్‌)లు కానరావడంలేదు. రేషన్‌దుకాణాల పర్యవేక్షణకు డివిజన్‌, మండల స్థాయిలో విజిలెన్స్‌ కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ అందించడంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలి. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఆహార సలహా సంఘాలను రద్దు చేసి విజిలెన్స్‌ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటి వరకు డివిజన్‌, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మండలంలో 36 రేషన్‌దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 13వేలకుపైగా రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ దుకాణాల నిర్వహణపై విజిలెన్స్‌ కమిటీల పర్యవేక్షణతో పాటు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. కమిటీల పర్యవేక్షణ లేని కారణంగా నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలకు సైతం నాణ్యమైన బియ్యం సరఫరా కావడంలేదు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం గురించి పట్టించుకునేవారులేకపోయారు.

కమిటీలు ఇలా..

జిల్లా స్థాయి కమిటీలకు కలెక్టరు, డివిజన్‌ స్థాయిలకు ఆర్డీఓ, మండల స్థాయి కమిటీకి తహశీల్దారు, ఎంపీపీ చైర్మన్లుగా ఉంటారు. దీంతో పాటు జెడ్పీటీసీతో పాటు ముగ్గురు మహిళ ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ, వ్యవసాయ అధికారి, ఇద్దరు ఉపాధ్యాయులు ఇద్దరు రేషన్‌డీలర్లు, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

కమిటీలు వేయలేదు



మండలంలో ఇప్పటి వరకు విజిలెన్స్‌ కమిటీలు వేయలేదు. గతంలో కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేయడంతో అవకతవకలు జరిగేవి. ప్రస్తుతం ఆన్‌లైన్‌ విధానం అమలవుతుంది. రేషన్‌ దుకాణాలపై నిఘా పెంచి పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. ఉన్నతాధికారులు జారీ చేస్తే గ్రామ స్థాయిలో కమిటీలు వేస్తాం.

– కృష్ణయ్య, తహసీల్దారు దౌల్తాబాద్‌